గొంతు విప్పాలి.. అభివృద్ధి సాధించాలి

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. పాలకులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా కూటమి నేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ స్థానికంగా నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని వాగ్దానాలు చేశారు. అలాగే తాము అధికారంలోకి వస్తే..నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. పరిశ్రమలు, ఫ్యాక్టరీలు తీసుకొస్తాం. ఉద్యోగులను భర్తీచేస్తామని ఊదరగొట్టారు. కానీ ఇంతవరకు వాటి ఊసే ఎత్తడం లేదు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు గళం విప్పాలని, సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి పాటుపడాలని, ఎన్నికల హామీని నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు. - సాక్షి, నెట్‌వర్క్



రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా ఇప్పటి వరకు పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వలేదు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. పంటలు సాగు చేసేందుకు సిద్ధపడుతున్నాం. ఇప్పటికై నా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించే విషయంపై స్పష్టత ఇవ్వాలి. **- చల్లానరసింహారెడ్డి, రైతు, రాచాయపేట, గోపవరం మండలం**

రాజోలిని పూర్తి చేయాలి



మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుదాకర్‌యాదవ్ కృషి చేయాలి. అలాగే మౌలిక వసతులతో పాటు రాజోలు జలాశయాన్ని పూర్తి చేసేందుకు ప్రయత్నించాలి. రాయలసీమకు దక్కాల్సిన తాగు, సాగు నీటిపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించాలి. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి. **- దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఖాజీపేట**

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 45 రోజులైంది. ఇంత వరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయకపోగా వాటి గురించి దిశానిర్దేశం చేసిన పాపాన పోలేదు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు హామీ అమలు చేయలేదు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని గెలిచి ఇప్పుడు ఒక్కరికే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలి. **ఎదురుసుబ్బారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి, కాశినాయన మండలం**

యువతకు ఉపాధి కల్పించాలి



యువతకు ఉపాధి కల్పించే విధంగా అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలు చేస్తే రాయలసీమ నిరుద్యోగులకు ఎంతో ఉపయోగం. వేల సంఖ్యలో ప్రొద్దుటూరులో నిరుద్యోగులు ఉన్నా పరిశ్రమలు మాత్రం లేవు. పీఎంఎఫ్‌ను పునరుద్ధరించడంతోపాటు కొత్త అవకాశాలు కల్పించాలి. **- రవి, ప్రొద్దుటూరు.**

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలి. గత ప్రభుత్వంలో ప్రారంభించిన పెన్నానదిపై బ్రిడ్జి, మార్కెట్, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ, ఆర్టీసీ బస్టాండ్, పైపులైన్, డ్రైనేజీ కాలువల ఆధునీకరణ పనులను, ఎస్‌సీఎస్‌ఆర్ కాలేజి అభివృద్ధి, జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి పనులను పూర్తి చేయాలి. **- అరవ రామచంద్రారెడ్డి, ప్రొద్దుటూరు.**

కేపీ ఉల్లి కేంద్రం ఏర్పాటు చేయాలి



అభివృద్ధి చేస్తారని ప్రజలు నమ్మి ఎమ్మెల్యేగా పుట్టా సుదాకర్‌యాదవ్‌ను ప్రజలు గెలిపించారు. అందుకు తగ్గట్లుగా ఆయన నియోజవకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించాలి. కేపీఉల్లి కేంద్రం ఏర్పాటుతో పాటు చెక్కర ఫ్యాక్టరీని తెరిపించేలా చర్యలు తీసుకోవాలి. **- దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఖాజీపేట**

ఆదుకోవాలి



ఎన్నికల ముందు తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది చదువుతూ ఉంటే వారందరికి రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ప్రభుత్వం పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీలో చర్చించి త్వరితగతిన తల్లికి వందనం నిధులు జమ చేసి ఆదుకోవాలి. **- వై.హాజరతమ్మ, మార్త్రోమానగర్, బద్వేలు**

క్లుప్తంగా

కుష్టువ్యాధి నివారణకు చర్యలు



సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : కుష్టువ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ హిమబిందు, డీపీఎంఓ శివ శంకరయ్య తెలిపారు. సోమవారం కుష్టు వ్యాధి గుర్తింపు కోసం సాయికుటీర్ రోడ్డు, టీబీరోడ్డులో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు ఉండటంతో పాటు కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం తదితర లక్షణాలను కుష్టు వ్యాధిగా అనుమానించాలన్నారు. ఈ వ్యాధికి ధనిక, పేద అనే తేడా ఉండదని తెలిపారు. ఎవరికైన స్పర్శలేని పొడలు ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చూపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీసుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా.. తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రవికుమార్, ప్రతాప్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని భూమిని స్వాధీనం చేసుకోవాలని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ రాయలసీమ కన్వీనర్ తీట్ల రవికుమార్, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ విద్యాసాగర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీలోని సర్వే నంబర్ 200లోని దాదాపు 15 సెంట్ల స్థలంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి పేరు చెప్పుకుని కొందరు స్థలాన్ని ఆక్రమించి పునాదులు నిర్మించారని తెలిపారు. వెంటనే ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

మేకలు మృతి



పాలపొడి తిని మృతిచెందిన మేకలు

బద్వేలు అర్బన్ : కాలం తీరిన పాలపొడి తిని 5 మేకలు మృతిచెందిన ఘటన సోమవారం బద్వేలు పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే పట్టణంలోని మడకలవారిపల్లె ఎస్సీకాలనీకి చెందిన అక్కిదాసరి సౌజన్య అనే మహిళ మేకలు పోషించుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఈమెకు ఉన్న 30 మేకలను సోమవారం మడకలవారిపల్లె ఎస్సీకాలనీ సమీపంలోని బహిరంగ ప్రదేశంలోకి మేతకు తీసుకెళ్లింది. ఈ సమయంలో ప్రధాన రహదారిలోని కల్వర్టు వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పడేసిన కాలం తీరిన పశువులలో పాల ఉత్పత్తిని పెంచే పాల పొడి ప్యాకెట్లలోని పాలపొడిని మేకలు తిన్నాయి. తిన్న పది నిమిషాలకే 5 మేకలు అక్కడికక్కడే మృతిచెందగా మిగతా మేకలు అస్వస్థతకు గురయ్యాయి. వెంటనే పశువైద్యాధికారిని పిలిపించి చికిత్స చేయడంతో అస్వస్థతకు గురైన మేకలు కోలుకుంటున్నాయి.

అనాథ శవానికి అంత్యక్రియలు

కాశినాయన : మండలంలోని వివేకానంద సేవాశ్రమం నిర్వాహకులు ఓ అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. వృద్ధురాలిని ఆమె కుమారుడు మూడు నెలల క్రితం జ్యోతిక్షేత్రంలో వదిలి వెళ్లాడు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఆమెను అక్కడి నిర్వాహకులు వివేకానంద సేవాశ్రమం నిర్వాహకులు రామకృష్ణారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకెళ్లి సేవలందించారు. సోమవారం ఆమె మృతిచెందడంతో అంత్యక్రియలు నిర్వహించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మనోజ్, సుంకే వెంకటేశ్వర్లు, చిన్ని సునీల్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్మశాన వాటికకు స్థలం కేటాయించండి

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లింలు అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక స్మశాన స్థలం, ప్రహరీ గోడతో పాటు రస్తాను ఏర్పాటు చేయాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్థానికులు అంత్యక్రియలు జరుపుకునేందుకు ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ఈ విషయాన్ని మండల, గ్రామ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

మంచి పనులు చేసేవారిని అభినందించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి

రాజుపాళెం : గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను అందరూ అభినందిచాలని, ఈ పనులు చేసేవారు లేరని మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్‌ఏ నారాయణ రెడ్డి కొనియాడారు. మండల పరిషత్ సభా భవనంలో సోమవారం నారాయణ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజారామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని, కొన్ని గ్రామాల్లో తాగునీటి పథకాలకు మళ్లీ టెండర్లకు ఆహ్వానిస్తామని తెలిపారు. ఎంఈఓ రామస్వామి రెడ్డి మాట్లాడుతూ 26 పాఠశాలలకు రెండో విడతలో బడ్జెట్ వచ్చిందని, దాదాపు 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ మంజుల మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి సోమవారం, గురువారం వ్యాక్సినేషన్ జరుగుతుందని టీబీ వ్యాధి రాకుండా ఈ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. మండల పశువైద్యాధికారి ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో మినీ గోకులాలు మంజూరయ్యాయని వాటిని పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని ఉషోదయ హైస్కూల్, కశెట్టి హైస్కూల్‌లో సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దోమల వ్యాప్తిని అరికట్టాలని, దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ డయేరియా వ్యాధి లక్షణాలను, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్యాధికారి డాక్టర్ దినేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా, గోవిందరెడ్డి, సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సచివాలయ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతోనే మార్కులు ‘పది’లం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారులు కృష్ణప్ప, రాజగోపాల్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు ప్రణాళికతో చదవాలని ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప సూచించారు. పదో తరగతి విద్యార్థులకు కీలకమైన దశ అని, బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. సోమవారం మండలంలోని తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఆయన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఇప్పటి వరకు ఎంత సిలబస్ పూర్తయిందని పదో తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సబ్జెక్టులలో ప్రశ్నలు అడుగుతూ విద్యార్థుల పరిశీలన జ్ఞానాన్ని తెలుసుకున్నారు. విద్యార్థుల సమాధానాలకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా ప్రతి రోజు హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను అర్థం చేసుకుని నేర్చుకోవాలని సూచించారు. కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వై.గోపీనాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్పకు వినతి పత్రం అందజేస్తున్న పీఎల్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ రాజు

ప్రొద్దుటూరు : జిల్లాలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రైవేట్ టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీఎల్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్పకు ప్రైవేట్ టీచర్ల సమస్యలపై ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం గడ్డం రాజు మాట్లాడుతూ జీఓ ఎంఎస్ 1 ప్రకారం ప్రైవేటు పాఠశాలల నిర్మాణం జరిగిందని తెలిపారు. అందులో పనిచేసే ప్రైవేటు టీచర్లకు చట్టపరంగా రావాల్సిన జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు విద్యా సంస్థల యాజమాన్యాలు ఇవ్వకుండా చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్నారని విమర్శించారు. 1982 విద్యా చట్టం 84ఏ ప్రకారం చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాంకేతికతతో మెరుగైన ఫలితాలు



డ్రోన్ల ఉపయోగంపై డెమో ఇస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మైదుకూరు : వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. సోమవారం కేవీకేలో కోరమండల్ ఇంటర్నేషనల్, అరటి, పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘం సహకారంతో రైతులకు డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ డ్రోన్లతో రైతులు శ్రమను ఆదా చేయవచ్చని అన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు మందులను పిచికారీ చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అరటి, మిరప పంటల్లో పోషక యాజమాన్య పద్ధతుల గురించి ఆయన వివరించారు. జీవన ఎరువుల ప్రాముఖ్యత వాటి ఉపయోగాలను తెలియజేశారు. డివిజనల్ ఆగ్రానమిస్ట్ టి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల సేంద్రీయ ఎరువులు, పోషకాలు, నానో డీఏపీ గురించి వివరించారు. సీనియర్ ఆగ్రానమిస్ట్ నర్సిరెడ్డి పంట ఆధారిత ఎరువులు, సేంద్రీయ ఎరువుల గురించి వివరించారు. కార్యక్రమంలో కోరమండల్ నెల్లూరు జోనల్ మేనేజర్ రమణారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీవిద్యారాణి, డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ, వనిపెంట ఎఫ్‌పీఓ చైర్మన్ బాలనరసింహారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

అట్లూరు : రైతుభరోసా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులకు అందుబాటులో ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని డీఏఓ రామకృష్ణయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని అట్లూరు రైతుభరోసా కేంద్రంలో అట్లూరు, గోపవరం అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సోమవారం మండల రైతుభరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం మొదలైందని, రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు వారికి అందుబాటులో ఉండాలని సిబ్బంది ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారులు విజయకుమార్, ఓబయ్య, గ్రామ వ్యవసాయాధికారులు రామ్మోహన్‌రెడ్డి, అరుణ, సునీత, సందీప్, అనూష, సుబ్బయ్య, సందీప్, బాదుల్లా పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

చాపాడు: మండలంలోని అన్నవరం, ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయాల వద్ద ఈ నెల 23, 25, 26, 27 తేదీలలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రహంతుల్లయ్య తెలిపారు. 23, 25న అన్నవరం సచివాలయం వద్ద మండలంలోని అన్నవరం, మడూరు, చియ్యపాడు, బద్రిపల్లె, సోమాపురం, చిన్నగురువళూరు, లక్ష్మీపేట, 26, 27న ఖాదర్‌పల్లె సచివాలయం వద్ద ఖాదర్‌పల్లె, పల్లవోలు, అయ్యవారిపల్లె, ఎన్.ఓ బాయపల్లె, పెద్దగురువళూరు, అల్లాడుపల్లె, వెదురూరు గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు ఆధార్ సేవలు వినియోగించుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక హోమస్ పేటలోని కల్యాణ చక్రవర్తి హాస్పిటల్‌లో ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికిపైగా రోగులకు ఉచితంగా హెచ్‌బీఏ1సీ, ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్ రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మధుమేహం పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆహార పదార్థాల్లో మార్పుతోపాటు రోజూ అరగంట వ్యాయామం చేయాలని సూచించారు.

స్టీల్ ప్లాంట్ సాధనకు ఉద్యమిస్తాం

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో స్టీల్ ప్లాంట్ సాధనకు అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఎస్ఎస్ ఖలందర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రధానమైన అంశాల్లో జిల్లాలో స్టీల్ ప్లాంట్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం ఉందని తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత కీలకమైన సందర్భాల్లో ప్రధానమైన ఈ రెండు డిమాండ్లు పెట్టలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రాజధాని అమరావతి, పోలవరం అనే మంత్రాలనే జపిస్తున్నారని, వాటి వలన రాయలసీమ ప్రాంతానికి, కడప జిల్లాకు ఒరిగేదేమి లేదన్నారు. రాయలసీమ బిడ్డల ఆకాంక్షల్లో ఒకటైన స్టీల్‌ప్లాంట్ సాధనకు అందరూ కలిసికట్టుగా స్టీల్ ప్లాంట్‌కు ఉద్యమించాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, కరస్పాండెంట్

కలసపాడు : జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక సెయింట్ ఆంటోనీస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా స్థాయిలో తైక్వాండో పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు తమదైన శైలిలో విజయం సాధించి మూడు రజతం, మూడు కాంస్య పతకాలను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తా ప్రభావతి, కరస్పాండెంట్ చిత్తారాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఒక చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

తైక్వాండో మాస్టర్‌కు సన్మానం

పోరుమామిళ్ల (అట్లూరు) : తైక్వాండో కోచ్ మాస్టర్ నాయబ్‌రసూల్ సోమవారం పోరుమామిళ్లలో తైక్వాండో విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం ప్రొద్దుటూరు వినాయకనగర్‌లోని దేవాంగ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు ఆగస్టులో ధర్మవరం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు కోచ్ మాస్టర్ నాయబ్‌రసూల్‌ను ఘనంగా సన్మానించారు.

టెట్, డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే టెట్, డీఎస్సీ ఫ్రీ క్లాసులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధానోపాధ్యాయుడు రవిప్రకాష్ తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో సోమవారం టెట్, డీఎస్సీ ఎస్జీటీ, ఎస్ఏ తెలుగు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించి మాట్లాడారు. లక్ష్యం వైపు దృష్టి పెట్టి ప్రతి రోజు ప్రణాళికతో చదివినప్పుడే కాంపిటీషన్‌లో విజేతగా నిలబడుతారని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ దస్తగిరి, చంటి, జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు



ప్రమాణ స్వీకారం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని జయనగర్ కాలనీలోని నారాయణ ప్రైడ్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌బాయ్, హెడ్ గర్ల్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించి ఫలితాల తర్వాత వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా ఏజీఎం నజీర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హుస్సేన్, డీన్ సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కులో వసతులు లేక ఇక్కట్లు



పార్కులో జిమ్ చేస్తున్న ప్రజలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధి టూటౌన్ బైపాస్ రోడ్డులోని థర్డ్ కాలనీలో ఉన్న పార్కులో వసతులు లేక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. థర్డ్ కాలనీ నిర్మాణంలో భాగంగా పార్కు కోసం గతంలో స్థలం కేటాయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పార్కు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఓ వైపు జిమ్, మరో వైపు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. వర్షాల ప్రభావంతోపాటు వినియోగిస్తున్న కారణంగా వాకింగ్ ట్రాక్ చాలా వరకు దెబ్బతింది. వర్షాలకు ట్రాక్‌లో మట్టి తేలడంతోపాటు నిర్మాణం దెబ్బతింది. పార్కులో మూత్రశాలలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పలు సందర్భాల్లో కౌన్సిల్‌లో ప్రస్తావించినా ఫలితం లేదు.

మూత్రశాలలు నిర్మించాలి



పార్కుల్లో ట్రాక్‌లను నిర్మించడంతోపాటు మూత్రశాలలను ఏర్పాటు చేయాలి. మహిళలు, పురుషులు రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వస్తున్నారు. సెలవురోజుల్లో ఎక్కువ సంఖ్యలో జిమ్ కోసం ప్రజలు వస్తున్నారు. కౌన్సిల్‌లో పార్కు సమస్యలను ప్రస్తావించా. **- ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్, ప్రొద్దుటూరు**

వాకింగ్ ట్రాక్ దెబ్బతింది



రెండు వైపులా ఉన్న పార్కుల్లో వాకింగ్ ట్రాక్ దెబ్బతింది. పాదచారులు నడవడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు పరిశీలించి ట్రాక్‌ను పునర్నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్కులో మూత్రశాలలు ఏర్పాటు చేయాలని చాలా రోజులుగా ప్రజలు కోరుతున్నారు. పార్కులో మౌలిక వసతులు కల్పించాలి **- గద్దం సురేష్, ప్రొద్దుటూరు.**